
సాక్షి అనంతపురం

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

35.7°/14.4°

జిల్లా పరిధిలో సోమవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఒకేషనల్ విద్యార్థులకు రెండోవిడతగా ప్రారంభం కాగా, జనరల్ విద్యార్థులకు తొలివిడత ప్రారంభమయ్యాయి. ఉదయం జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు 56 కేంద్రాల్లో జరిగాయి. జనరల్ విద్యార్థులు 2,799 మందికి గాను 2,761 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 1,285 మందికి గాను 1,139 మంది హాజరయ్యారు. 146 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 54 కేంద్రాల్లో సాగిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 2,019 మందికి గాను 1,991 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 956 మందికి గాను 922 మంది హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణ నాయక్ నాలుగు కేంద్రాలు, డీఈసీ సభ్యులు ఆరు కేంద్రాలను పరిశీలించారు.

కోర్టులో లొంగిపోయిన ఫైనాన్స్ కంపెనీ మేనేజర్

ఉరవకొండ: పట్టణంలోని కనకదుర్గా గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో దాదాపు రూ.60 లక్షలు విలువ చేసే 1,130 గ్రాముల బంగారాన్ని మాయం చేసిన ఘటనలో నిందితుడు, కంపెనీ జనరల్ మేనేజర్ జ్వాలా చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉరవకొండ కోర్టులో లొంగిపోయారు. దీంతో ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకల్యాణి ఈనెల 24 వరకూ జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఘటనపై సదరు ఫైనాన్స్ కంపెనీ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు జనవరి 26న ఉరవకొండ అర్బన్ పీఎస్‌లో కేసు నమోదైంది. కేసులో ఏ-1గా కంపెనీ మేనేజర్ పల్లా ప్రశాంత్‌కుమార్, ఏ-2గా అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశులు, ఏ-3గా కంపెనీ ఆడిటర్ రామాంజినేయులు, ఏ-4గా చంద్రశేఖర్‌రెడ్డి, ఏ-5గా గుర్నాథ్‌రెడ్డి ఉన్నారు. కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

నకిలీ టీసీతో ఎస్కేయూలో అడ్మిషన్

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుడిపై గవర్నర్‌కు ఫిర్యాదు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో నకిలీ టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్)తో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు నగరగిరి కిరణ్‌కుమార్ అడ్మిషన్ పొందారని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు వాసు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నకిలీ టీసీతో అడ్మిషన్ పొందడంతో మెరిట్ విద్యార్థికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. వెంటనే అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు వెల్లడించారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఎస్కేయూ ఉన్నతాధికారులను గవర్నర్ కార్యాలయం ఆదేశించినట్లు తెలిపారు. వర్సిటీ అధికారులు పారదర్శకంగా సమాచారం ఇవ్వాలని, లేకుంటే జరగబోవు పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గరుడ వాహనా.. గోవిందా

బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండమీదరాయుడు రోజుకో వాహన సేవలో భక్తులను కటాక్షిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఆద్యంతం కనులపండువగా సాగింది. మంగళవారం శ్రీవారిని శ్వేత గజ వాహనంపై ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనాథ్ స్వామి పేర్కొన్నారు.



గరుడ వాహనంలో శ్రీవారు

ఆదాయం ఢమాల్!

- అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఓ వ్యక్తి ఇటీవల 3 సెంట్ల స్థలం కొన్నారు. రెండ్రోజుల క్రితం నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి స్థలం రిజిస్ట్రేషన్ చేయించేందుకు వెళ్లారు. అయితే, రిజిస్ట్రేషన్ చార్జీలు చూసి భయపడిన ఆయన... ప్రస్తుతానికి అగ్రిమెంటు మీదే ఉంటా, తర్వాత చూసుకుందాంలే అంటూ వెనక్కు వచ్చారు.
- కదిరికి చెందిన ఓ వ్యక్తి ఫిబ్రవరి 3వ తేదీన ఇల్లు కొన్నారు. రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా రూ. 3 లక్షల మేర ఖర్చయింది. గతంలో ఎన్నడూ ఇంతలా చార్జీలు పెంచిందిలేదంటూ ప్రభుత్వ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి పన్నుల భారం మోపనంటూ గతంలో చెప్పిన చంద్రబాబు.. సీఎం అయ్యాక మాట తప్పారంటూ విమర్శించారు.



- ఇటీవల భూముల విలువ పెంచిన కూటమి సర్కారు
- ప్రభుత్వ తీరుతో భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్‌లు
- వచ్చేనెలతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- ఇప్పటివరకూ సగానికి కూడా లక్ష్యం చేరని వైనం
- కూటమి నేతల ఆగడాలతో కొత్త వెంచర్లకు మొగ్గు చూపని రియల్టర్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పాలనలో ఆదాయం రివర్స్ అయింది. గతంలో ఏటా స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల ద్వారా భారీగా సర్కారుకు ఆదాయం వచ్చేది. అలాంటిది కూటమి నేతల బెదిరింపులు, ఆక్రమణలు వంటి కారణాలతో స్థిరాస్తి రంగం కుదేలైంది. దీనికి తోడు ఈనెల 1 నుంచి భూముల విలువ పెంచడంతో రిజిస్ట్రేషన్‌లు పూర్తిగా పడిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు తాజా గణాంకాల ద్వారా వెల్లడైంది. ఈ ఏడాది లక్ష్యంలో 65 శాతం కూడా ఆదాయం వచ్చే పరిస్థితి లేదని ఆ శాఖ అధికారులు వాపోతున్నారు.

తాడిపత్రిలో ఆగిన రిజిస్ట్రేషన్లు

తాడిపత్రిలో మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. అయితే సోమవారం తాడిపత్రి టౌన్‌కు సంబంధించినవి మాత్రమే చేసినట్లు తెలిసింది. స్థానిక టీడీపీ నేతల ఆదేశాలతోనే రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

రెండు డాక్యుమెంట్లు కూడా లేవు..

గత వైఎస్సార్ సీపీ సర్కారు హయాంలో అమ్మకాలు, కొనుగోళ్లతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడేవి. తాజాగా పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. గుంతకల్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు ఒకటి లేదా రెండు డాక్యుమెంట్లు మాత్రమే వస్తున్నాయి. ఫిబ్రవరి 1 తర్వాత అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్ కార్యాలయాల్లో ఒక్కో రోజు ఐదారు డాక్యుమెంట్లు కూడా రావడం లేదు. సాధారణంగా అపార్ట్‌మెంట్లు, ఖాళీ ప్లాట్‌లు, ఇళ్ల రిజిస్ట్రేషన్ ద్వారానే సర్కారుకు ఎక్కువ ఆదాయం వస్తుంది. మొత్తం విలువలో స్టాంపు డ్యూటీ కింద 6.5 శాతం, రిజిస్ట్రేషన్‌కు 1 శాతం అంటే మొత్తం 7.5 శాతం వస్తుంది. ఉదాహరణకు రూ.20 లక్షల ఫ్లాట్ అమ్మితే రూ.1.50 లక్షల వరకూ ప్రభుత్వానికి అందుతుంది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌లే లేకపోవడంతో ఆదాయం పూర్తిగా పడిపోయింది.

ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖలో రాబడి ఇలా

ఉమ్మడి జిల్లాలో మొత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	21
గత ప్రభుత్వ హయాంలో నెలసరి ఆదాయం	రూ.30 కోట్లు
కూటమి సర్కారు కొలువుదీరాక వస్తున్న రాబడి	రూ.4 కోట్లు
ఈ ఏడాది అనంతపురం జిల్లా రాబడి లక్ష్యం	రూ.469 కోట్లు
ఇప్పటివరకూ వచ్చిన ఆదాయం	రూ.227 కోట్లు
శ్రీ సత్యసాయి జిల్లా లక్ష్యం	రూ.248 కోట్లు
ఇప్పటి వరకూ వచ్చిన ఆదాయం	రూ.121 కోట్లు

ఒకప్పుడు నెలకు రూ.30 కోట్లు..

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకు రూ.30 కోట్ల వరకూ స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల ద్వారా ఆదాయం వచ్చేది. ఇప్పుడా రుసుము రూ.4 కోట్లు కూడా ఉండటం లేదు. దీన్నిబట్టి కార్యాలయాల్లో క్రయవిక్రయాలు ఎలా ఉన్నాయో అంచనా వేయొచ్చు. కొత్త నిర్మాణాలు, స్థిరాస్తి వెంచర్లు వేసే నాథుడే కానరావడం లేదు. కొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నేరుగా ఎమ్మెల్యేలే ఫోన్ చేసి పెద్ద పెద్ద రిజిస్ట్రేషన్లు తమకు తెలియకుండా చేయవద్దని, అలా చేస్తే బదిలీపై వెళతారని సబ్ రిజిస్ట్రార్‌లను బెదిరిస్తున్నారు. అంతేకాదు రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసే వారిని, బిల్డర్లను బెదిరిస్తుండటంతో ఎవరూ ముందుకు రావడం లేదు. పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీల వల్ల ఆదాయం పూర్తిగా పడిపోయింది. దీంతో ఉపాధి కరువై వందలాది మంది డాక్యుమెంటు రైటర్లు లబోదిబోమంటున్నారు.

బాలికల ఆత్మరక్షణ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన– ఆత్మరక్షణ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల విద్యార్థినులు 4,238 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మునిసిపల్ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, హై స్కూల్‌ప్లస్ స్కూళ్లలో 6-9 తరగతుల విద్యార్థినులు 42,555 మంది ఉన్నారన్నారు. వీరందరికీ 'రాణి లక్ష్మీబాయి ఆత్మపరిశీలన-ఆత్మ రక్షణ ప్రశిక్షణ' (స్వీయ రక్షణ) పథకం కింద కరాటే, తైక్వాండో తదితర స్వీయరక్షణ కళల్లో శిక్షణ ఇచ్చేందుకు రిజిస్టర్ అయిన సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయా సంస్థలకు కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రైతులకు ఐడీ నంబర్లు

అనంతపురం సెంట్రల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతుకూ ఒక ఐడీ నంబర్ కేటాయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి(జేడీఏ) ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, రాయితీ పనిముట్లు, రాయితీ విత్తనం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర వాటికి ఈ ఐడీ కీలకమని వివరించారు. ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడెంటిఫికేషన్ నంబర్ కలిగి ఉండాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అంతా మాదే.. అన్నీ మాకే



టెండర్ దక్కినా డబ్బు కట్టించుకోకపోవడంతో దిగాలుగా ఉన్న సురేంద్రకుమార్



ఫొటోలు తీయొద్దని చెబుతున్న అనంతపురం ఎమ్మెల్యే అనుచరుడు గంగారామ్

- 'కల్లు గీత' మద్యం షాపులపై టీడీపీ సిండికేట్ పడగ
- 'అనంత'లో టెండర్ దక్కించుకున్న వ్యక్తికి బెదిరింపులు

అనంతపురం: కల్లు గీత కులాల కుటుంబాలకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం షాపులన్నీ తమ పార్టీ 'సిండికేట్'కే అప్పగించింది. గతంలోనూ నానా రభస చేసి, టెండర్ దక్కించుకున్న వారిని భయభ్రాంతులకు గురి చేసి ప్రైవేట్ మద్యం దుకాణాలను గుప్పిట పట్టిన టీడీపీ మాఫియా.. తాజాగా కల్లు గీత కులాలకు కేటాయించిన దుకాణాలను సైతం అదే రీతిలో చేజిక్కించుకుంది. జిల్లాలో 14 మద్యం షాపులను కల్లు గీత కులాలకు కేటాయించారు. మొత్తం 63 దరఖాస్తులు అందగా.. సోమవారం అనంతపురం జెడ్పీ ఆవరణలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. అయితే, సింహభాగం మద్యం షాపులు టీడీపీ నాయకులే దక్కించుకున్నారు. ముందుగానే సిండికేట్‌గా ఏర్పడి ఇతరులు దరఖాస్తు చేయకుండా అడ్డుకున్న నాయకులు.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారిని సైతం టెండర్ల సందర్భంగా అడ్డుకుని హస్తగతం చేసుకోవడం విమర్శలకు తావిచ్చింది.

ఎమ్మెల్యే అనుచరుడి హల్‌చల్..

టెండర్ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అనుచరుడు కోనంకి గంగారామ్ రెచ్చిపోయాడు. టెండర్ దక్కించుకున్న సురేంద్ర కుమార్ అనే వ్యక్తిని బహిరంగంగానే బెదిరించాడు. లాటరీలో టెండర్ దక్కించుకున్న తక్షణమే సురేంద్ర చుట్టూ ఎమ్మెల్యే అనుచరులు చేరారు. ఈ క్రమంలోనే సాక్షాత్తు పోలీసుల ముందే సురేంద్రను గంగారామ్ బెదిరించాడు. కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశాడు. సురేంద్ర వినకపోవడంతో ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో లైసెన్స్ సొమ్ము కట్టించుకోలేదు. ఇందుకు 24 గంటల సమయం ఉందని అధికారులు సురేంద్రకు ఉచిత సలహా ఇచ్చారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే ఇంటికి సురేంద్ర వెళ్లి రాగా, వెంటనే డబ్బు కట్టించుకోవడం గమనార్హం. షాపు లైసెన్స్ మాత్రం కల్లు గీత కార్మికుడిది.. లాభం మాత్రం అధికారంలో ఉన్న తమకు దక్కేలా సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు తెలిసింది.

రాప్తాడులో రౌడీ రాజ్యం

- చాకలి నరసింహులుపై దాడి కేసును నీరుగార్చే కుట్ర
- హంద్రీ–నీవా సభను అడ్డుకునేందుకే 'పరిటాల' కుతంత్రం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పరిటాల కుటుంబం రాప్తాడులో రౌడీరాజ్యం నడిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కనగానపల్లి మండలం గుంతపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి నరసింహులుపై ఆదివారం జరిగిన హత్యాయత్నం కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చాకలి నరసింహులును సోమవారం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నరసింహులుపై దాడి ఘటనను మొత్తం మీడియా ప్రచారం చేసిందన్నారు. అయితే, 24 గంటలు గడవకముందే కేసును నీరుగార్చేందుకు పరిటాల కుటుంబం కుట్ర పన్నిందన్నారు. రాత్రికి రాత్రి ధర్మవరం ఆస్పత్రిలో వైద్యులను మాట్లాడుకుని, టీడీపీ కార్యకర్త చెన్నప్పపై దాడి జరిగింది.. ఆయనకు ఆరుకుట్లు పడ్డాయంటూ హైడ్రామాకు తెర తీశారన్నారు. ఆగమేఘాలపై కేసు నమోదు చేసిన పోలీసులు గుంతపల్లి ఆనందరెడ్డిని రిమాండ్‌కు తరలించారని విమర్శించారు. చెన్నప్పపై అసలు దాడే జరగలేదని, ఎల్లో మీడియాలో సైతం ఎక్కడా రాలేదని గుర్తు చేశారు.

దోపిడీ బయట పడకూడదనే..

హంద్రీ–నీవా కాలువ కాంక్రీట్ లైనింగ్ పనుల్లో రూ. వంద కోట్లు కమీషన్లు దండుకునే పన్నాగానికి పరిటాల సునీత తెరతీశారని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. లైనింగ్ పనులు చేపడితే హిందూపురం పార్లమెంటు నియోజకవర్గంలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముందని, దీనిపై నెలరోజులుగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈనెల 12న తూముచెర్లలో సభ ఏర్పాటు చేయాల్సి ఉందని, ఈ క్రమంలో సభను అడ్డుకోవాలనే దురుద్దేశంతో నరసింహులుపై టీడీపీకి చెందిన చెన్నప్ప, శ్రీరాములు మరో నలుగురు దాడి చేసి కొడవలితో నరికారన్నారు.

సునీతపై చర్యలు తీసుకోవాలి


అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న పరిటాల సునీతపై చంద్రబాబు చర్యలు తీసుకోవాలని, దాడికి ప్రేరేపించిన శ్రీరామ్‌పై కేసు నమోదు చేయాలని ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెన్నానదిలో ఇసుకను అమ్ముకున్నారని, మట్టిని అమ్ముకుని ఆలమూరు కొండకు గుండు కొట్టించారని మండిపడ్డారు. ఖూనీ కేసుల్లో సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కక్కలపల్లి టమాట మండీలో కేజీకి రూపాయి కమీషన్ దండుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో వెయ్యి బెల్ట్‌షాపులు పెట్టించారని, అధికారంలోకి రాగానే 2 వేల మంది ఉద్యోగులను తీయించి కడుపులు కొట్టారని విమర్శించారు.

ప్రజలు తిరగబడతారు..


పోలీసులు తాము వేసుకున్న ఖాకీ చొక్కాకు విలువ కడుతున్నారా అని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. పరిటాల గుమ్మానికి వాచ్‌మెన్లు, గుమాస్తాలు కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. బాధితుల పక్షాన కాకుండా నేరస్తుల పక్షాన నిలబడతారా? అని మండిపడ్డారు. చట్టం అధికార పార్టీ చుట్టమైతే ప్రజలు తిరగబడతారనే సంగతిని గుర్తు పెట్టుకోవాలన్నారు. గుంతపల్లి ఘటనపై సంపూర్ణ విచారణ జరిపించాలని, అక్రమ కేసు నమోదుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, డీజీపీని డిమాండ్ చేశారు. సమావేశంలో కనగానపల్లి, ఆత్మకూరు ఎంపీపీలు కుంపటి భాగ్యలక్ష్మీ, హేమలత, కనగానపల్లి, రాప్తాడు, అనంతపురం రూరల్, రామగిరి మండలాల కన్వీనర్లు నాగముని, బండి పవన్, గోవిందరెడ్డి, సాకే వెంకటేశ్, మీనుగ నాగరాజు, యూత్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నీరుగంటి నారాయణరెడ్డి, నాయకులు మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, జూటూరు శేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..

- పరిష్కార వేదికలో ప్రజల విన్నపాలు
- అధికారులకు 405 వినతులు



ఈ దివ్యాంగుని పేరు జి.వాసుదేవ శాస్త్రి. అనంతపురం నగర పరిధిలోని రుద్రంపేట బైపాస్‌లో నివాసముంటున్నాడు. సోదరుడు ప్రభుత్వ ఉద్యోగి అనే కారణంతో ఇతని దివ్యాంగ పింఛన్ను తొలగించారు. ప్రస్తుతం ఆయన వివాహం చేసుకుని వేరుగా ఉంటున్నాడు. హౌస్ హోల్డ్‌లోనూ విభజన అయ్యింది. ప్రస్తుతం వాసుదేవశాస్త్రి తన తల్లితో కలిసి ఉంటున్నాడు. జీవనం చాలా కష్టంగా ఉందని, పింఛను మంజూరు చేస్తే ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు అర్జీ సమర్పించాడు. స్పందించిన అసిస్టెంట్ కలెక్టర్... వాసుదేవ శాస్త్రికి పింఛను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించండంటూ అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్నతో పాటు డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు.వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 405 అర్జీలు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ శివ్ నారాయణ్ శర్మ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- అనంతపురం గుత్తిరోడ్డులోని మార్కెట్ యార్డు సమీపంలో పట్టాభూమిని కొందరు ఆక్రమించి గుడిసెలు వేశారని స్వామి, ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 80, 90, 91, 92లో తమకు రెండు ఎకరాల పొలం ఉందని, సర్వే నంబరు 93లో పోరంబోకు స్థలం ఉందని చెప్పారు. కొందరు వ్యక్తులు పోరంబోకుతో పాటు పట్టా స్థలాన్ని ఆక్రమించి గుడిసెలు వేశారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్వామి వాపోయాడు.
- భూ సమస్యపై రెండేళ్లుగా తిరుగుతున్నా పరిష్కారం చూపలేదంటూ కంబదూరు మండలం రాళ్లఅనంతపురం గ్రామానికి చెందిన నజీర్ ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 366–4లో తాను సాగు చేసుకుంటున్న రెండెకరాల ప్రభుత్వ భూమికి డి.పట్టాను గతంలోనే మంజూరు చేశారని చెప్పాడు. అయితే ఈ భూమికి సంబంధించి 1బీ, అడంగల్ రావడం లేదని, న్యాయం చేయాలని కోరాడు.
- తన భర్త కేశప్ప గత ఏడాది జూలై 19న మరణించాడని, పింఛను మంజూరు చేయాలని బుక్కరాయసముద్రం మండలం అనంతసాగర్ కాలనీకి చెందిన నారాయణమ్మ విన్నవించింది. అదే విధంగా ఉరవకొండ గాంధీ చౌక్‌కు చెందిన సుంకమ్మ తన సమస్యను అధికారులకు చెప్పుకుంది. తన భర్త 2023 జూలై 27న మరణించడంతో పింఛను రద్దు చేశారని తెలిపింది. తనకు ఏ ఆదరువు లేదని పింఛను మంజూరు చేయించాలని కోరింది.

క్లుప్తంగా

కో-ఆపరేటివ్ సెక్టార్‌ను బలోపేతం చేయాలి

- జేసీ శివ్‌నారాయణ శర్మ



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ శివ్‌నారాయణశర్మ

అనంతపురం అర్బన్: జిల్లాలో కో-ఆపరేటివ్ (సహకార) సెక్టార్‌ను బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలు, కార్యకలాపాలు చేపట్టాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా కో-ఆపరేటివ్ శాఖ ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో-ఆపరేటివ్స్, కో-ఆపరేటివ్ బిల్డ్ ఏ బెటర్ వరల్డ్' పోస్టర్లను అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న కలసి ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, డీసీఓ అరుణకుమారి, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, మల్లికార్జున, డీసీసీబీ సీఈఓ సురేఖారాణి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌కు పీడీల ఎంపిక



పీడీలు తబిత, వేణును అభినందిస్తున్న హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: వచ్చే నెల బెంగళూరు వేదికగా జరిగే జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు తబిత, వేణుగోపాల్ ఎంపికయ్యారు. ఈ నెల 8, 9 తేదీల్లో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని పీటీసీలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో 50 సంవత్సరాల విభాగంలో షార్ట్‌పుట్, హ్యామర్‌త్రోలో తబిత మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచారు. 55 సంవత్సరాల కేటగిరిలో వేణుగోపాల్ 400 మీటర్ల రిలేలో ద్వితీయ స్థానం, జావెలిన్ త్రోలో తృతీయస్థానాన్ని కైవసం చేసుకుని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిద్దరినీ ప్రధానోపాధ్యాయుడు భూపాల్‌రెడ్డి, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

కుందుర్పి: వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన శేఖర్ (38)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇటీవల వ్యసనాలకు బానిసైన ఆయన తన అవసరాలు తీర్చుకునేందుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడం, కొత్తగా అప్పులు పుట్టకపోవడంతో సోమవారం రాత్రి 7 గంటలకు తన ఇంటి పక్కనే ఉన్న మరుగుదొడ్డిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మాఘ పౌర్ణమి వచ్చిందంటే చాలు ఆ గ్రామం నిర్మానుష్యమవుతుంది. 24 గంటల పాటు ఆ గ్రామ వీధుల్లో మనుషులే కాదు.. పిల్లి, కుక్క, చివరకు కోడి కూడా కనిపించదు. దాదాపు నాలుగు శతాబ్దాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని ఎంతో పవిత్రంగా గ్రామస్తులు ఆచరిస్తుండడం విశేషం.

- నాలుగు శతాబ్దాలుగా వస్తున్న ఆచారం
- ఆచారానికి కట్టుబడి ఉండాలన్న పెద్దల తీర్మానానికి సాక్ష్యంగా నిలిచిన రచ్చకట్ట



ముస్తాబైన హాజీవలి దర్గా



తలారిచెరువు గ్రామంలోని ఓ వీధి

శతాబ్దాల ఆచారం...
ఊరంతా నిర్మానుష్యం!

తాడిపత్రి రూరల్: మండలంలోని తలారిచెరువుకు సుదీర్ఘ చరిత్రనే ఉంది. తాడిపత్రి పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో పూర్వీకుల ఆచార వ్యవహారాలను నేటికీ పాటిస్తుండడం విశేషం. ఇందులో భాగంగా ఏటా మాఘ పౌర్ణమి నాడు గ్రామస్తులు తట్టాబుట్టా సర్దుకుని, పిల్లాజెల్లా, పశు, పక్షి సంపదతో 24 గంటల పాటు గ్రామాన్ని విడిచి వెళ్లిపోతారు. ఈ ఆచారాన్ని గ్రామస్తులు 'అగ్గిపాడు' అని పిలుస్తుంటారు.

గ్రామం సుభిక్షంగా ఉండాలని...

అగ్గిపాడు ఆచారాన్ని ఏటా క్రమం తప్పకుండా నిర్వహించడం వెనుక ఓ కథను స్థానికులు నేటికీ విశ్వసిస్తున్నారు. దాదాపు 400 సంవత్సరాల క్రితం వర్షాలు కురవక తలారిచెరువు గ్రామంలో దుర్భిక్ష



గ్రామంలోని రచ్చకట్ట

పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాభివృద్ధి కుంటుపడింది. ఆకలి బాధ తాళలేక చిన్నారులు మృత్యువాత పడ్డారు. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు గ్రామ సమీపంలోనే ఉన్న హాజీవలి దర్గాలో స్వామీజీని కలసి తమ ఇబ్బందులు ఏకరవు పెట్టారు. శాప ప్రభావంతో గ్రామానికి అరిష్టం దాపురించిందని, ఇది తొలగి పోవాలంటే ఏటా మాఘ పౌర్ణమి నాడు గ్రామాన్ని ఖాళీ చేసి హాజీవలి దర్గాలో ఉండాలని స్వామీజీ సూచించడంతో అప్పటి నుంచి గ్రామస్తులు ఈ ఆచారాన్ని పాటిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న గ్రామస్తులు అగ్గిపాడు ఆచారాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున గ్రామాన్ని విడిచే స్థానికులు హాజీవలి దర్గా వద్దకు చేరుకుని అక్కడే వంటావార్పుతో సరదాగా గడిపి, తిరిగి అర్ధ రాత్రి దాటిన తర్వాత గ్రామానికి చేరుకుంటారు. నిర్మానుష్యంగా మారిన గ్రామంలోకి దొంగలు చొరపడకుండా ఉండేందుకు చుట్టూ యువకులు కాపలాగా ఉంటారు.

పరుగు పందెం నిర్వహించేవారు



హాజీవలి దర్గా వద్దకు గ్రామస్తులంతా చేరుకుని మహిళలు వంటలు చేస్తున్న సమయంలో రైతులు ఎద్దుల బండ్ల పోటీల్లో నిమగ్నమవుతుంటారు. పోటాపోటీగా సాగే గ్రామీణ క్రీడా పోటీలు చూసి అందరూ కేరింతలతో ఎంజాయ్ చేస్తారు. దీంతో మాఘ పౌర్ణమి ఎప్పుడు వస్తుందా అనే ఏడాదంతా ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటాం.

– వెంకటరాముడు, తలారిచెరువు

అంతా సందడిగా ఉంటుంది



అగ్గిపాడు ఆచారాన్ని ఓ పండుగలా చేసుకుంటున్నాం. గ్రామానికి శాప విమోచనం అయిన రోజు కావడంతో కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా ఏకమవుతాం. అందరూ కొత్త దుస్తులు ధరించి హాజీవలి దర్గా వద్దకు చేరుకుని వంటావార్పుతో సందడిగా గడుపుతాం. అల్లుళ్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, బంధువులందరూ ఈ వేడుకలో పాల్గొంటారు. ఆ వాతావరణమే వేరు.

– హాజీపీరా, తలారి చెరువు

ఆ రోజు తిరునాలే..



నా వయస్సు 70 ఏళ్ల పైమాటే. చిన్నప్పటి నుంచి మాఘ పౌర్ణమి నాడు గ్రామాన్ని ఖాళీ చేసి అందరూ హాజీవలి దర్గాకు వెళ్లేవాళ్లం. అక్కడ పూజల అనంతరం ఎంతో సందడిగా గడుపుతాం. నిజంగా ఓ తిరునాలను తలపించేలా ఏర్పాట్లు ఉంటాయి. రంగుల రాట్నాలు, గాజుల అంగళ్లు, తినుబండారాల అంగళ్లు, ఐస్‌క్రీం బండ్లు, ఆట వస్తువుల అంగళ్లు, దొమ్మర ఆటలు, గారడి విద్యలు చేసేవారితో కళకళలాడుతుంది.

– లక్ష్మీనారాయణమ్మ, తలారిచెరువు

పూర్వం నుంచి వస్తున్న ఆచారం



తలారిచెరువు గ్రామం ఖాళీ చేసి హాజీవలి దర్గాలో బస చేయడం పూర్వం నుంచి వస్తున్న ఆచారం. గ్రామస్తులు దర్గాలో ప్రార్థనలు చేసి ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. మతసామరస్యానికి ప్రతీకగా ఈ ఆచారాన్ని కొనసాగించడం చాలా ఆనందంగా ఉంది.

– జహీర్‌బాషా, ముజావర్

సంతానం కలగలేదని మహిళ బలవన్మరణం

రాప్తాడురూరల్: సంతానం కలగలేదనే తీవ్ర మనస్తాపం చెందిన మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ ఎస్‌ఆర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసులు, అరుణలక్ష్మి (42) దంపతులు. శ్రీనివాసులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి 15 ఏళ్ల కిందట వివాహమైంది. ఇప్పటిదాకా పిల్లలు కాలేదు. దీనికితోడు ఇటీవల అరుణలక్ష్మి ఓ వ్యాధి బారిన పడింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. భర్త ఆటోకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి రాగా ఎంతసేపటికీ వాకిలి తీయలేదు. అనుమానం వచ్చి కిటికీలో నుంచి తొంగిచూడగా భార్య ఉరికి వేలాడుతూ విగత జీవిగా కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైభవంగా జలధి ఉత్సవం

అమరాపురం: మండలంలోని గొడనకుంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవి జలధి ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, గ్రామస్తులతో కలిసి ఉత్సవ విగ్రహాన్ని బంగారు పాళ్యం సమీపంలోని వంకవద్దకు తీసుకెళ్లి గంగాజలంతో శుద్ధి చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మ వారికి 101 వడలు వేసి గ్రామంలోని అన్ని కులాల వారికి ప్రసాదంగా అందజేశారు. జిల్లా నుంచే కాక కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో గొడనకుంట జన



కెంచమాంబదేవి ఉత్సవ విగ్రహానికి జలధి పూజ నిర్వహిస్తున్న భక్తులు

సంద్రమైంది. సాయంకాలం ఉత్సవ విగ్రహాన్ని డప్పు వాయిద్యాలతో ఆలయానికి తిరిగి చేర్చారు. అంతకుముందు కాడెద్దులను నూతనంగా తయారు చేయించిన ఇనుప బండికి కట్టి లాగుడు పోటీలు నిర్వహించారు.

పీఎస్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న నరేష్

హిందూపురం అర్బన్: స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే పోలీసులు అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ మహేష్ తెలిపిన మేరకు... హిందూపురంలోని శ్రీకంఠపురానికి చెందిన బెల్లం నరేష్ కొంత కాలంగా కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన ఓ యువతితో ప్రేమాయణం నడిపాడు. ఇది కాస్త బెడిసి కొట్టడంతో కొంత కాలంగా వారి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కొందరు దుండగులు తన భవనాన్ని కూలదోసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ డయల్ 100కు నరేష్ ఫోన్ చేశాడు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆ సమయంలో గౌరీబిదనూరుకు చెందిన యువతి తండ్రి అక్కడ ఉండటంతో ఆయనను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. విచారణలో నరేష్ పేరు చెప్పి కొందరు తనను గౌరీబిదనూరు నుంచి బలవంతంగా కారులో ఎక్కించుకుని వచ్చారని వివరించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం రాత్రి నరేష్‌ను విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించారు. ఆ సమయంలో అసహనానికి గురైన నరేష్ అక్కడే ఉన్న కత్తి తీసుకుని పొడుచుకున్నాడు. సకాలంలో పోలీసులు అడ్డుకుని నరేష్‌ను ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి నరేష్‌పై ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ విఫలమే కారణం

- ల్యాబ్ టెక్నీషియన్ మృతి కేసులో వీడిన మిస్టరీ

రాప్తాడు రూరల్: అనంతపురం నగర శివారున నేషనల్ పార్క్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అభిలాష్ (28)ది ఆత్మహత్యనే అని పోలీసులు నిర్ధారించారు. ఆదివారం సాయంత్రం అభిలాష్ మృతదేహాన్ని గుర్తించినా... ఆ ప్రాంతం ఎవరి పరిధిలోకి వస్తుందనే స్పష్టత కోసం త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, రూరల్ పోలీసులు మల్లగుల్లాలు పడిన విషయం తెలిసిందే. సాయంత్రం సమయంలోనే మృతదేహాన్ని గుర్తించినా ఎవరికి వారు తమ పరిధి కాదంటే తమపరిధి కాదని మిన్నకుండిపోయారు. అభిలాష్ శరీరంపై కాలిన గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు రేకెత్తాయి. మృతదేహం లభ్యమైన ప్రాంతంపై ఎట్టకేలకు సోమవారం స్పష్టత వచ్చింది. కాగా, కదిరి మండలం నడింపల్లికి చెందిన మహేంద్ర అనంతపురం సాయినగర్‌లో చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. మహేంద్ర దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో అభిలాష్ పెద్దకుమారుడు. గతంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసిన అభిలాష్ తర్వాత కొద్దిరోజులు కియా కంపెనీలో పని చేశాడు. ప్రస్తుతం ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తున్నాడు. తాను ప్రేమించిన అమ్మాయి మరో యువకుడితో వివాహానికి సిద్ధపడింది. ఈ క్రమంలో నిశ్చితార్థం కూడా జరిగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అభిలాష్ పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

● గరుడ వాహనంపై రంగనాథుడు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఐదో రోజు దేవేరులతో కలసి రంగనాథుడు గరుడవాహనంపై ఊరేగాడు. ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున్న జరిగాయి. ఈఓ రామాంజనేయులు, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం డివిజన్ కమిటీల ఎన్నిక



ఎన్నికైన మహిళా విభాగం కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రెవెన్యూ డివిజన్ కమిటీలను సోమవారం స్థానిక కృష్ణ కళామందిర్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళ చైర్‌పర్సన్ పారె లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, అనంతపురం జిల్లా చైర్‌పర్సన్ సురేఖరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణజ్యోతి, అసోసియేట్ చైర్‌పర్సన్ కృష్ణవేణి, కోశాధికారి నీరజ, కో-చైర్మన్లు హైమావతి, నాగవేణి, ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్.ఎన్.దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఖాన్, ఇతర నాయకులు పాల్గొన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ కమిటీ చైర్‌పర్సన్‌గా అయేషా, ప్రధాన కార్యదర్శిగా సాయిలీలా, కో-చైర్ పర్సన్లుగా మాధవి, నాగనందిని, కోశాధికారిగా లోహిత, కార్యదర్శులుగా వెంకటమ్మ, మాధవి ఎన్నికయ్యారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కమిటీ చైర్‌పర్సన్‌గా తేజావతిబాయి, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, కో-చైర్ పర్సన్లుగా రజని, కీర్తి అరుణ, కోశాధికారిగా దీపిక, కార్యదర్శిగా నరసమ్మను ఎన్నుకున్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఫాతిమా, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి, కో-చైర్ పర్సన్లుగా అరుణ, అంజినమ్మ, కోశాధికారిగా ఇందు కుమారి, కార్యదర్శిగా ముంతాజ్ ఎన్నికయ్యారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులందరూ శింగనమలకు చెందిన వారే. చిన్నజలాలపురం సమీపంలో కొండపై ఉన్న దోణరామేశ్వరాలయంలో సోమవారం సాయంత్రం పూజలు ముగించుకుని తిరుగు ప్రయాణమై వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులు ఆదిలక్ష్మి, గాయత్రి, స్నేహ, పావని, సావిత్రిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేర్చింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పొలానికి మళ్లీ నిప్పు



కాలిపోయిన డ్రిప్ పరికరాలు

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఓబులేసు, వసంత్‌కు చెందిన పొలానికి మళ్లీ నిప్పు పెట్టారు. ఘటనతో డ్రిప్ పరికరాలు, మోటార్ సెడ్‌పూర్తి కాలిపోయాయి. బాధిత రైతులు తెలిపిన మేరకు... పుల్లలరేవు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 88-3, 5 (న్యూ)లో తమకున్న 7.76 ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ పెద్ద ఓబులేసు, వసంత్ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ పొలంలో రెండేళ్ల క్రితం 400 అల్ల నేరేడు మొక్కలను నాటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఓబులేసుకు చెందిన మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. ఈ ఏడాది జనవరి 17న 15, అదే నెల 21న 40 చెట్లను నరికి వేశారు. మళ్లీ ఈ నెల 3న గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఓబులేసు తోటకు నిప్పు పెట్టడంతో కొన్ని చెట్లు కాలిపోయాయి. వారం రోజులు కూడా గడవక ముందే మళ్లీ ఆదివారం రాత్రి మరోసారి నిప్పు పెట్టడంతో తోటలోని డ్రిప్ పరికరాలు, మోటర్ సెట్ పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన తలారి విజయ్‌కుమార్, సునీల్, అనిల్, చెన్నారెడ్డి, మార్పం రమేష్ తదితరులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ పదేపదే ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాహనం ఢీ - జింక మృతి



జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: స్థానిక మోడల్ స్కూల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జాతీయ రహదారిని దాటుతున్న కృష్ణ జింక మృతి చెందింది. ప్రమాదానికి గురైన అనంతరం కొన ఊపిరితో ఉన్న జింక దాదాపు 50 మీటర్ల దూరం పరుగెత్తుకుంటూ వెళ్లి కుప్పకూలి ప్రాణాలు విడిచింది. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో ఏబీఓ చంద్రశేఖర్, పశువైద్యశాల ఏహెచ్‌ఏ రామనాయక్, అటెండర్ ఓబులేసు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జింక కళేబరానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు.

ఖేలో ఇండియా అస్మిత యూ-13 విజేత 'పురం'



విజేత హిందూపురం జట్టుతో నేషనల్ ఫుట్‌బాల్ క్రీడాకారులు

అనంతపురం: ఖేలో ఇండియా అస్మిత యూ-13 ఫుట్‌బాల్ లీగ్ విజేతగా హిందూపురం జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఆర్డీటీ క్రీడా గ్రామంలో టోర్నీ కొనసాగింది. మొత్తం 78 మంది ప్రఖ్యాత అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో ఆరు క్లబ్బులకు చెందిన జట్లు టోర్నీలో ప్రాతినిధ్యం వహించాయి. విజేతగా హిందూపురం, రన్నర్స్‌గా కళ్యాణదుర్గం జట్లు నిలిచాయి. క్రిస్పిన్ ఛైత్రి ఇండియన్ ఉమెన్ ఫుట్‌బాల్ టీం హెడ్ కోచ్ ప్రియ పీవీ, ఇండియన్ ఫుట్‌బాల్ టీం అసిస్టెంట్ కోచ్ అనిత మిశ్రా, క్రికెట్ కోచ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) వేణుగోపాల్, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి కింద పడి వృద్ధుడి మృతి

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరులో సోమవారం చింత చెట్టుపై నుంచి కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాముడు (65) సోమవారం వరి పైరుకు నీరు పెట్టేందుకు తోటకు వెళ్లాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తోటకి వెళ్లి చూశారు. అక్కడ చింత చెట్టు కింద విగతజీవిగా పడి ఉండడంతో గమనించి బోరున విలపించారు. మృతుడికి చెయ్యి విరిగి, గాయలవడంతో చెట్టుపై నుంచి కింద పడి మృతి చెంది ఉంటాడని నిర్ధారించుకున్నారు.

యువకుడిపై కొడవలితో దాడి



చికిత్స పొందుతున్న అజయ్

పామిడి: స్థానిక సంత మార్కెట్ వీధిలో ఆదివారం రాత్రి కొడవళ్లతో దాడి చేయడంతో అదే వీధికి చెందిన ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... సంత మార్కెట్ వీధికి చెందిన మాల అజయ్‌కు అదే వీధికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. విషయం తెలుసుకున్న యువతి తరపు వారు ఆదివారం రాత్రి అజయ్‌ను మాట్లాడుదామంటూ పిలిపించుకుని ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో మాటామాట పెరగడంతో కొడవలితో దాడి చేశారు. ఘటనలో అజయ్ వీపుపై బలమైన గాయమైంది. కుటుంబసభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందజేసి, అనంతరం అనంతపురానికి తరలించారు. అజయ్ ఫిర్యాదు మేరకు అశోక్, వెంకటేష్, విష్ణు, రామాంజనేయులు, ఆయన కుమారుడు రాముపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఫిర్యాదులపై స్పందించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి ఆదేశించారు. ప్రజల నుంచి సోమవారం 57 ఫిర్యాదులు ఇచ్చాయి. భార్యభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా, కోర్టు మానిటరింగ్ సీఐ వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నారు’



జేసీ శివ నారాయణ శర్మకు సమస్యలను వివరిస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం అర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నాయని ఏబీవీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు ఫిర్యాదు చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను దగ్గర పెట్టుకుని ఫీజుల కోసం వేధిస్తున్నాయని చెప్పారు. వాటి తీరు ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్‌రెడ్డి, నాయకులు విజయ్, దివాకర్ నాయక్, సుధీర్, భూతరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీకి ట్యాలెంట్ విజనరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు ట్యాలెంట్ విజనరీ అవార్డు–2025 లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సోమవారం తెలిపారు. ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో 350 మంది విద్యార్థులు సేల్స్ ఫోర్స్ వర్చువల్ ఇంటర్నషిప్ పోగ్రాం, ప్రాజెక్ట్ రెడీ టాలెంట్ పోల్స్ పోగ్రాంను పూర్తి చేశారన్నారు. ఇందుకు సేల్స్ ఫోర్స్ కంపెనీ తరపున ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలకు టాలెంట్ విజనరీ అవార్డు–2025ను బెంగుళూరులో జరిగిన సదస్సులో ప్రదానం చేశారన్నారు. సేల్స్ ఇంటర్నషిప్ పోగ్రాం కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ ఆటోమేషన్ వర్క్ ఫ్లో అనే అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అవార్డును కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఐఐ సెల్, కన్వీనర్ డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, కో–కన్వీనర్ కొండన్న, అందుకున్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న మల్లికార్జున

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఇప్పటిదాకా పట్టించుకోలేదన్నారు. వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, పెన్షన్లకు అర్హులైన వాళ్లు చాలామంది ఉన్నారన్నారు. సమావేశంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, ఆత్మకూరు మండల కార్యదర్శి రామకృష్ణ, రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, ఆత్మకూరు మండల సహాయ కార్యదర్శి శివ, ఏఐవైఎఫ్ ధనుంజయ, శారద, దుర్గాప్రసాద్, అజయ్, కుళ్లాయప్ప, రాజు, నరేంద్ర పాల్గొన్నారు.

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతన్నల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తున్నారు. కూలీల ఖర్చులు, రసాయన మందుల ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. కాలం కలసిరాక, వాతావరణం మార్పు, వైరస్‌ల దెబ్బకు ఆశించిన దిగుబడులు రావడం లేదు. పంట తొలగించక పొలాల్లోనే వదిలేస్తున్నారు. పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారు.



యర్రంపల్లి సమీపంలో ఢిల్లీ రకం దోస పంటను వదిలేసిన దృశ్యం

దోస రైతులకు నిరాశే..

- నష్టాలు మిగిల్చిన ఢిల్లీ రకం దోస
- వాతావరణం మార్పు, వైరస్‌తో పెరగని కాయల సైజు
- ఎకరా పంట సాగుకు రూ.లక్ష వరకూ ఖర్చు
- పెట్టుబడి కూడా అందని పరిస్థితి
- నష్టాల పాలవుతున్న రైతన్నలు



దామాజిపల్లి వద్ద దోసకాయలను తొలగించకుండా వదిలేసిన ఓ రైతు

చెన్నేకొత్తపల్లి: సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి.. వాణిజ్య పంటలు సాగు చేసి లాభాలు పొందాలనుకున్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. మంచి దిగుబడి వస్తే చేసిన అప్పులన్నీ తీర్చుకోవచ్చని పంటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు. తీరా పంటలు పండక చేసిన అప్పులు పెరిగిపోతుండటంతో రైతన్నలు మనోవేదనకు గురవుతున్నారు. ఇటీవల మండలంలో చాలా మంది రైతులు దోస, కర్బూజా, ఢిల్లీ రకం దోస సాగు చేశారు. ఢిల్లీ రకం దోస పంటను ఎకరా విస్తీర్ణంలో సాగు చేసేందుకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. నాణ్యమైన విత్తనాల కోసం కిలో రూ.70 వేల నుంచి 80 వేల వరకూ ఖర్చు పెట్టాలి. వీటిని సాగు చేసేందుకు మల్చింగ్ షీట్, పంట ఎదుగుదల, కాయల పరిమాణం పెరిగేందుకు రసాయన మందులు, కూలీల ఖర్చులన్నీ భరించాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఢిల్లీ రకం దోస పంటను మండల వ్యాప్తంగా దాదాపు 250 నుంచి 300 ఎకరాల్లో సాగు చేసినట్లు సమాచారం. పంట సాగు చేసిన కొన్ని రోజుల వరకూ పంట ఎదుగుదల ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఉన్నపళంగా పంట ఎదుగుదల ఆగిపోయింది. వాతావరణంలో మార్పు రావడం, వైరస్ సోకడంతో కాయల సైజు పూర్తిగా తగ్గిపోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలో ఆశించిన దిగుబడులు కూడా రాలేదు. పంట తొలగించేందుకు మళ్లీ కూలీ ఖర్చులు భరించలేక రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి తిరిగి రాలేదని చెబుతున్నారు. నీటి వసతి పుష్కలంగా ఉన్నప్పటికీ.. పంటలు చేతికి రాకపోవడంతో ఏమి చేయలేని స్థితిలో ఉన్నామంటున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని.. వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అప్పు చేసి సాగు చేశా..

ఢిల్లీ రకం దోస సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయనే ఆశతో అప్పులు చేసి మరీ పంట పెట్టాను. వేసవి ప్రారంభానికి పంట కోత దశకు వస్తుందని భావించాను. అయితే పంట సాగు చేసిన అనంతరం వాతావరణంలో మార్పులు వచ్చాయి. చలి ఎక్కువ కావడంతో పంటకు వైరస్ సోకింది. పంట మొత్తం దెబ్బ తింది. పంటను తొలగించక పొలంలోనే వదిలేశాను.

– నాగరాజు, రైతు. చెన్నేకొత్తపల్లి

చలికి కాయల సైజు తగ్గుతోంది

ఇటీవల మండలంలో వివిధ గ్రామాల రైతులు వాణిజ్య పంటలు సాగు చేశారు. చలి కారణంగా దోస కాయల సైజు తగ్గుతోంది. ఆశించిన దిగుబడులు కూడా రావడం లేదు. రైతులు పంట రాలేదని లేనిపోని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలి.

– రాంప్రసాద్, ఇన్‌చార్జ్ మండల ఉద్యానశాఖ అధికారి, చెన్నేకొత్తపల్లి

గవ్వల పరంధామ మృతి బాధాకరం



గవ్వల పరంధామ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న గోరంట్ల మాధవ్

రాప్తాడు: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గవ్వల పరంధామ (40) సోమవారం ఉదయం మృతి చెందారు. రాప్తాడుకు చెందిన గవ్వల పరంధామ గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వైస్ ఎంపీపీగా కొనసాగాడు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి నాలుగేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీలో చేరారు. అప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కోసం నిరంతరం కృషి చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ వేర్వేరుగా వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గవ్వల పరంధామ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలన్నారు. గవ్వల పరంధామ మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా చూసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరంధామ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, కుట్టిమద్ది రమేష్, పసుపుల నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో వివిధ కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలి. నగరాభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని మేయర్ వసీం సూచించారు. సోమవారం నగరపాలక సంస్థలో మేయర్ చాంబర్‌లో కమిషనర్ బాలస్వామితో మేయర్ మాట్లాడారు. అభివృద్ధి పనులు ఆగిపోవడంతో నగరంలో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నగరంలో ఎక్కడ చూసినా కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయని గుర్తు చేశారు. కౌన్సిల్ సమావేశంలో 30 ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని నగరంలో చెత్తను తరలించేందుకు ఆమోదించామని.. ఇప్పటిదాకా ట్రాక్టర్లను ఏర్పాటు చేయలేదన్నారు. 132 మంది అదనపు కార్మికులను ఎంపిక చేయాల్సి ఉండగా.. ఇప్పటిదాకా ఎంపిక చేయలేదని వెంటనే ఎంపిక చేసి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలన్నారు. లైట్లు కొనుగోలు చేసిన ఇంకా చాలా ప్రాంతాల్లో లైట్లను ఏర్పాటు చేయలేదన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి పూర్తీ స్థాయి బడ్జెట్ అందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఆయా సెక్షన్ల అధికారులు వెంటనే సిద్ధం చేయాలన్నారు.

స.హ చట్టంపై చైతన్యం తీసుకురండి



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం సిటీ: సామాన్యుల పాలిట వరంగా మారిన సమాచార హక్కు చట్టంపై విస్తృత ప్రచారం అవసరమని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా ప్రతినిధులు క్యాంప్ కార్యాలయంలో సోమవారం గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలనలో పారదర్శకత, ప్రభుత్వాధికారుల్లో జవాబుదారీతనం పెంచడానికి, అవినీతిని అంతం చేయడానికి సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. వాటిపై ఇంకా చాలా మందిలో సరైన అవగాహన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల్లోనూ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించే బాధ్యతను కమిటీ సభ్యులు తీసుకోవాలని సూచించారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ నబీరసూల్, అధ్యక్షుడు హోన్నూరప్ప, వర్కింగ్ ప్రసిడెంట్ షేక్ ఇమాం, ఉపాధ్యక్షులు కె.ఎన్.రసూల్, అంకె రామలింగయ్య, హుస్సేన్‌పీరా, ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ట్రెజరర్ బాలన్న, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సమస్యలే పట్టించుకుంటారా?

- సామాన్యుల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే దగ్గుపాటి
- ‘ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే అనుచరుల హల్‌చల్



అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముస్తఫా

అనంతపురం కార్పొరేషన్: నగపాలక సంస్థలో సోమవారం కమిషనర్ బాలస్వామి అధ్యక్షతన జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు హల్‌చల్ చేశారు. ఎమ్మెల్యేతో పాటు వచ్చిన టీడీపీ గల్లీ నాయకులు వారి సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతిపత్రాలు ఇవ్వడం గమనార్హం. ఎక్కడైనా ప్రజల సమస్యలను తెలుసుకోవాల్సిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తన అనుచరుల సమస్యలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపడం చర్చనీయాంశమైంది. నిత్యం ఎమ్మెల్యే వాహనానికి వేలాడుతూ తిరిగే చోటా నాయకులు వినతిపత్రాలు ఇవ్వడంలోనూ పోటీపడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

భూమి గుండ్రంగా తిరిగినట్టు రావాల్సిందే..

సార్ మారుతీనగర్‌లో రోడ్డు, కాలువ ఏర్పాటు చేయాలని కొన్ని నెలలుగా నగరపాలక సంస్థ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామంటే భూమి గుండ్రంగా తిరిగినట్టు తమ వద్దకు రావాల్సిందేనని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు మారుతీనగర్‌కు చెందిన సయ్యద్ ముస్తాక్ కమిషనర్ బాలస్వామికి విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరపాలక సంస్థలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 17 ఫిర్యాదులు వచ్చాయి. అందులో ఇంజినీరింగ్ 7, టౌన్ ప్లానింగ్ 2, రెవెన్యూ 1, ప్రజారోగ్యం 5 ఫిర్యాదులు ఉన్నాయి.

నిండుగా అధికారులు..

నగరపాలక సంస్థలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధికారులతో నిండుగా కనిపించింది. గతంలో ఒకరిద్దరితో కన్పించే కార్యక్రమం.. పదుల సంఖ్యలో అధికారులతో నిండిపోయింది. తరచూ అధికారులు అందుబాటులో ఉంటే నగర ప్రజల సమస్యలు చెప్పుకునేందుకు వీలుగా ఉంటుందని నగరపాలక సంస్థ సిబ్బందే చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ భాస్కర్ రావు, డీఈలు వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ, సుభాష్ చంద్ర బోస్, దాక్షాయని, ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీష, ఆర్ఓ లక్ష్మీదేవి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు కేసుల వివరాలు

అనంతపురం అగ్రికల్చర్: క్వాలిటీ కంట్రోల్‌లో భాగంగా 2010 నుంచి 2025 వరకూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలకు సంబంధించి కేసుల వివరాలను కమిషనరేట్‌కు పంపినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. గత 14 సంవత్సరాల నుంచి 140 విత్తన నమూనాలు ఫెయిల్ కాగా.. 73 కేసులు లీగల్ యాక్షన్‌కు అనుమతి ఉన్నట్లు తెలిపారు. అలాగే 175 ఎరువుల నమూనాలు ఫెయిల్ కాగా 135 కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. 68 పురుగుమందుల నమూనాలు ఫెయిల్‌కాగా 47 కేసులు కోర్టుల ఉన్నట్లు తెలిపారు. మరికొన్ని కేసులు వివిధ స్థాయిలో ఉన్నట్లు కమిషనరేట్‌కు తెలియజేసినట్లు వివరించారు.

ప్రభుత్వ గోదాములు ప్రారంభించరా?

అనంతపురం అర్బన్: రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ తీరు చూస్తే అద్దె గోదాములే ముద్దులా ఉందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో సంస్థకు సంబంధించి సొంత గోదాములు నిర్మాణం పూర్తయినా ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.12 కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో గోదాముల నిర్మాణం చేపట్టారన్నారు. ఇందులో రూ.7.5 కోట్లతో కొన్ని గోదాముల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. ఎకరా భూమికి సంబంధించి వ్యవహారం న్యాయస్థానంలో ఉన్నందున రూ.4.50 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్మాణం పూర్తయిన గోదాములను ప్రారంభించాలన్నారు. అద్దె రూపంలో ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రామాంజనేయులు, ముర్తుజా, ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు వాహనాల వేలం

అనంతపురం సెంట్రల్: రవాణా శాఖ కార్యాలయంలో వివిధ కేసుల్లో క్లెయిమ్ చేయని ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఆత్మకూరు/రాప్తాడు: రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆయా మండలాల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట స్కూళ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నులి పురుగులు పిల్లల కడుపులోకి చేరితే రక్తహీనతతో పాటు అనారోగ్యానికి గురవుతారని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మండల వైద్యాధికారి సబిహా సుల్తానా, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లీమారోజ్, రాప్తాడు ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం సాంబశివుడు, వైద్యాధికారి శివ కృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్గురువుల అనుగ్రహంతోనే ఉత్తమ జీవితం

రాప్తాడు/అనంతపురం కల్చరల్: సద్గురువుల అనుగ్రహంతోనే ఎవరికైనా ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని మైసూరుకు చెందిన అవధూత దత్తంకం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. 55 రోజులుగా రాష్ట్రంలో పలుప్రాంతాల్లో ఆధ్యాత్మిక వ్యాప్తి, లోకకల్యాణం కోసం పీఠాధిపతులు సందర్శిస్తూ ధర్మప్రబోధం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి జయలక్ష్మీపురంలో జరిగిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో దత్త విజయానంద తీర్థస్వామీజీ పాల్గొన్నారు. ఆశ్రమానికి విచ్చేసిన స్వామీజీకి వేదపండితులు మంత్రోచ్చాటనలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జయలక్ష్మి అమ్మవారి విగ్రహం వద్ద చక్రార్చన పూజలు జరిపించారు.

వివాహ సామగ్రి అందజేత



వధువుకు వివాహ సామగ్రి అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, సాదిక్‌వలి

అనంతపురం రూరల్: చంద్రబాబు నగర్‌కు చెందిన ఓ వధువుకు ఎంఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రుద్రంపేట ఎంపీటీసీ–4 సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్‌వలి సోమవారం వివాహ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రుద్రంపేట పంచాయతీ పరిధిలో ఎంతో మంది నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. నూతన వధువులకు తాళిబొట్టు, పట్టుచీర దుస్తులతో పాటు ఇతర సామగ్రి అందిస్తున్నామన్నారు. కార్యకమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షరీఫ్, ముఖాన్ ముస్తఫా, కాజా, అక్కమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

అనంతపురం కల్చరల్: భగవద్గీత విశిష్టతను అందరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం ఇందూ జ్ఞానవేదిక సభ్యులు నగరం నుంచి ఎస్కే యూనివర్సిటీ పరిసరాల వరకు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. జ్ఞానవేదిక సభ్యులు పక్కీరప్ప, జాహ్నవి, నీలావతి, మోహనమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నాలుగో ప్లాట్‌ఫాంపై రైళ్ల రాకపోకలు



అనంతపురంలో నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపైకి వస్తున్న రైలు

అనంతపురం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్ ఫాంపైకి రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అమృత్ భారత్ అమలులో భాగంగా అనంతపురం రైల్వే స్టేషన్‌ను అత్యంత ఆధునికంగా నిర్మించనున్న సంగతి తెలిసిందే. సుమారు రూ.9.29 కోట్లతో అనంతపురం రైల్వే స్టేషన్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా ఫస్ట్ రోడ్డు వైపు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. ఎప్పటి నుంచో కొనసాగుతూ వచ్చిన ఒకటో ప్లాట్‌ఫాంను కొన్నాళ్ల పాటు బంద్ చేశారు. ఇప్పుడు అదే ప్లాట్‌ఫాం నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం కానుంది. అధునాతన భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఏడాది నుంచి ఆగిపోయిన నాలుగో ప్లాట్‌ఫాంపైకి ఇప్పుడు రైళ్ల రాకపోకలను అనుమతించినట్లు స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్ కుమార్ తెలిపారు. మొత్తం నాలుగు ప్లాట్‌ఫాంలు ఇక్కడ ఉన్నాయి. అన్ని ప్లాట్‌ఫాంలపైకి రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

మార్కెట్‌లోకి మహీంద్రా న్యూ ఎలక్ట్రిక్ కారు



కారును ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: మహీంద్రా న్యూ ఎలక్ట్రిక్ బీఈవీ సెగ్మెంట్‌లో ‘మహీంద్రా బీఈ 6, ఎక్స్‌ఈవీ9ఈ’ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. సోమవారం జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఎంజీబీ మొబైల్ షోరూంలో జరిగిన కార్యక్రమంలో షోరూం సీఈఓ ఆదిత్య మాచాని, మేనేజర్స్ వంశీకృష్ణ, రామకృష్ణ, మస్తాన్‌వలీఖాన్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిక్చర్, చిప్స్ తయారీ కేంద్రాలపై దాడులు



మిక్చర్ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం: నగరంలోని పలు మిక్చర్, చిప్స్ తయారీ కేంద్రం, కేటరింగ్ సర్వీసు సెంటర్లు, వాటర్ ప్లాంట్ తదితర వ్యాపార సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అపరిశుభ్రత, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తుండటంతో రూ.70 వేల జరిమానా విధించారు. హోటల్, తినుబండారాలు, ఆహార–పానీయాల వ్యాపార సంస్థల యజమానులు శుభ్రత, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే. శ్రీనివాసులు, యు. సద్గురుడు, ఏఓ జే. వాసు ప్రకాష్, డీసీటీఓ సురేష్ కుమార్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్వార్ల విగ్రహ ప్రతిష్ట



చెన్నకేశవ ఆలయంలో కొలువుదీరిన ఆళ్వార్లు

అనంతపురం కల్చరల్: పాతూరులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వైష్ణవ సంప్రదాయంలో ప్రత్యేక స్థానమున్న 12 మంది ఆళ్వార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజాము నుంచే తిరుప్పావై పఠనం, బాలభోగ నివేదన, తీర్థ గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులుగా సాగుతున్న హోమాన్ని యజ్ఞాచార్యులు భాష్యం శ్రవణ్ కుమారాచార్యులు ముగిస్తూ పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపించారు. మధ్యాహ్నం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త వత్సలానందన్ పాల్గొన్నారు.